# తెలుగుతనం




తెలుగు విమర్శకుడికి తిట్టడంలో ఉన్న ప్రజ్ఞ మెచ్చుకోవడంలో లేదు. వేలెడంతేసివాడు జానెడంతేసివాణ్ణిచూసి, మూరెడంతేసివాళ్లున్నారు లేవోయ్ అంటాడు. తెలుగువిమర్శకుడనా అన్నాను ? తెలుగువాడన్న ప్రతీవాడికీ ఉన్న గుణమే అది. సినిమాకు వెళ్ళి ఈసడిస్తాడు. విందుకు వెళ్ళి వెక్కిరిస్తాడు. కావ్యం చదివి కర వొస్తాడు.

తెలుగువాడికి సరియైన విమర్శప్రామాణ్యాలు లేకపోవడమే ఇందుకు కారణమనుకుంటాను. గొర్రెలను తినేవాడెప్పుడూ ఉంటూనే ఉంటాడు. కాబట్టి కోళ్ళని తినేవాణ్ణి మెచ్చుకోనక్కర లేదన్నదే ఇతనివాదం అనవచ్చును. తెలుగువాళ్ళలో పైకి వచ్చినవాళ్ళంతా పైకిపోయినవాళ్ళే.

అయితే తెలుగువాడిలో ఒకదుర్మార్గం మాత్రం లేదు. ఏదో ఒక కసి మనస్సులో పెట్టుకొని ఎవరినీ ఇతగాడు తిట్టడు. కేవలం ఈ పనిని నిష్కామకర్మగానే నిర్వహిస్తాడు. దుమ్మెత్తిపొయ్యడం తెలుగువాడికి (ఇంగ్లీషులో చెప్పాలంటే) "ద్వితీయ ప్రకృతి."

ఫలానా కవి చాలా మంచి పద్యాలు రాస్తాడని నువ్వంటే, వెంటనే మన తెలుగువాడు పోనిద్దూ, వాడూ ఒక కవేనా అంటాడు. జాగ్రత్తగా గమనించాలి. ఈ మన తెలుగువాడు ఏదో ఒక ఆఫీసులో పనిచేసుకుంటూ ఉంటాడు. కవిత్వంజోలి కెప్పుడూ వెళ్ళిన పాపాన పోయి ఉండడు. కాని తన అమూల్యాభిప్రాయాన్ని మాత్రం జంకూ కొంకూ లేకుండా వెల్లడించి తీరుతాడు.

నాకు తీరుబాటుంటూ లేకపోతోందిగాని లేకపోతేనా దానితాతలాంటి కావ్యం రాసిపారెద్దును అనే అభిప్రాయం అతని మనస్సులో ఎక్కడో అట్టడుగున పొడుస్తూనే ఉంటుంది. కాని ఆమాట మాత్రం ఎప్పుడూ పైకి అనడు.

అలాగే మన ఆంధ్రుడు తనకు తీరుబాటుంటూ దొరికితే ఎన్నో చలనచిత్రాలు తయారుచేసే వాడు. అనవసరంగా గుజరాతీవాళ్ళతో పోటీ ఎందుకని పరిశ్రమలజోలికి పోలేదు. లేకపోతేనా ? తాను ప్రారంభించినవే కదా పరిశ్రమలన్నీ-తీరుబాటులేక ఆంధ్రేతరులకు అప్పగించేశాడుగాని.

ఇదో చిత్రం. తెలుగువాడు తానే అన్ని ఉద్యమాలనూ ప్రారంభించానని చాటుకుంటాడు. ప్రారంభం తనదయితేచాలు, అది తక్షణం ఆగిపోయినా బెంగలేదు మనవాడికి. మొదటి చలనచిత్రం, మొట్టమొదటి ప్రత్యేక రాష్ట్రాందోళన, ప్రజల భాషకోసం మొదట ఘోష పెట్టడం, ప్రప్రథమంలో సూటు తొడిగిన ఆంధ్రుడు-ముమ్ముందుగా ఆటంబాంబును నేనే కనిపెట్టానని నేడో రేపో ఎవడైనా ఆంధ్రుడు స్టేట్‌మెంటు ఇస్తే నాకేమీ ఆశ్చర్యమనిపించదు.

స్పర్ధకు బదులు సహకారం, అహంకారానికి బదులు ఆత్మనిగ్రహం, వైముఖ్యానికి బదులు సాముఖ్యం ఇవీ మనకు కావలసినవి. ఆంధ్రదేశంలోని అగ్రనాయకులలో వీటిని సకృత్తుగా చూస్తాము. యువకులతరంలోనైనా ఇవి సమృద్ధిగా వికసిస్తే ఆంధ్రదేశంలో ప్రజాజీవితం ఫలిస్తుందని చెప్పుకోవచ్చును.

---

* ఆనందవాణి